సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 21 । జూలై । 2023



బాధ్యతలు స్వీకరణ

జగిత్యాలక్రైం: జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా నాగేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.



అదనపు కలెక్టర్ తనిఖీ

మల్యాల: మండలంలోని ఒబులాపూర్, మ్యాడంపల్లి, గుడిపేట, సర్వాపూర్, తక్కళ్లపల్లి గ్రామాల్లో అదనపు కలెక్టర్ దివాకరన్ పర్యటించి, రికార్డులు తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
26.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 738.5 మి.మీ వర్షపాతం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం ఉదయం 8 గంటల వరకు 738.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ మేరకు జిల్లాలో సగటున 36.9 మి.మీ వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నంలో 9.7 మి.మీ, మల్లాపూర్ 11.4, రాయికల్ 32.2, బీర్‌పూర్ 34.5, సారంగాపూర్ 42.9, ధర్మపురి 35.4, బుగ్గారం 53.0, జగిత్యాలరూరల్ 48.4, జగిత్యాలఅర్బన్ 54.4, మేడిపల్లి 51.4, కోరుట్ల 28.3, మెట్‌పల్లి 19.6, కథలాపూర్ 31.6, కొడిమ్యాల 35.6, మల్యాల 45.2, పెగడపల్లి 55.3, గొల్లపల్లి 42.4, వెల్గటూర్ 39.0, ఎండపల్లి 32.5, బీమారం 35.7 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా గురువారం సాయంత్రం వరకూ మోస్తరు వర్షం కురిసింది.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు డాక్టర్ సేవలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్

రాయికల్(జగిత్యాల): 'ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు వైద్యురాలు సేవలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ యాస్మిన్ బాషా స్పందించారు. పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని గురువారం జిల్లా సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈనెల 17న రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్లు ఎవరు, ఎందుకు వెళ్లిపోయారు, ఆ సమయంలో ప్రైవేటు డాక్టర్ వచ్చి రోగులను పరీక్షించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది అనే విషయాలపై పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా సమయపాలన పాటించని వైద్యులపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.

లాటరీ పద్ధతిలో ఎంపిక



లాటరీ తీయిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: 2023–24 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవలేబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు గురువారం అదనపు కలెక్టర్ లత ఆధ్వర్యంలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. 1వ తరగతిలో ప్రవేశానికి 117 దరఖాస్తులు రాగా కేటాయించిన సీట్ల ప్రకారం 75 మందిని ఎంపిక చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. 10 మందిని వేయిటింగ్ లిస్ట్‌లో పెట్టినట్లు వివరించారు. 5వ తరగతిలో ప్రవేశాలకు 147 దరఖాస్తులు రాగా 76 మందిని ఎంపిక చేయడం జరిగిందని, 10 మందిని వేయిటింగ్ లిస్ట్‌లో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌క్వాస్ అవార్డుకు పది ఆరోగ్యకేంద్రాలు



మాట్లాడుతున్న సమియొద్దీన్

కథలాపూర్(వేములవాడ): కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్‌క్వాస్ అవార్డుకు జిల్లాలో 10 ఆరోగ్య కేంద్రాలు ఎంపిక కావడం సంతోషంగా ఉందని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు ఎం.డీ సమియొద్దీన్, శ్రీనివాస్ అన్నారు. గురువారం మేడిపెల్లి పీహెచ్‌సీనికేంద్ర బృందం అధికారులు సుప్రియ చౌదరి, శేషు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో 17 పీహెచ్‌సీలుండగా ఐదింటికి, 5 అర్బన్ పీహెచ్‌సీలకు మూడింటికి, 151 ఆరోగ్య ఉపకేంద్రాలకు రెండింటికి అవార్డులు వచ్చాయన్నారు. అవార్డు కింద పీహెచ్‌సీలకు ఏటా రూ.3 లక్షలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు రూ.1 లక్ష చొప్పున మూడేళ్లపాటు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సింధూజ, ప్రవీణ్‌చంద్ర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి కళాశాల కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు విడుదలైనట్లు జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఆంగ్లం–1, పొలిటికల్ సైన్స్–1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్–1, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్లం–1, తెలుగు–1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్–1, కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు–1, హిందీ–1, గణితం–1, కంప్యూటర్ అప్లికేషన్–1, డైరీ సైన్స్–1, మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర–1, పొలిటికల్ సైన్స్–1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్–1, కామర్స్ 1 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గలవారు ఆయా కళాశాలల్లో ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు అకాడమిక్ కో ఆర్డినేటర్ 98855 88419 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



విదేశాలకు వెళ్లాలని ఆశ.. దళారులతో గోస..

- రూ.లక్షలు దండుకుంటున్న బ్రోకర్లు
- విదేశీ ఉద్యోగాల పేరిట మోసం
- భారీ వేతనాలు అంటూ యువతకు ఎర
- ఆపై చేతులెత్తేస్తుండటంతో లబోదిబోమంటున్న బాధితులు

'మెట్‌పల్లికి చెందిన ఓ ఏజెంట్ కొంతకాలం క్రితం మలేషియాలో ఉద్యోగాల పేరిట కొందరి యువకుల వద్ద డబ్బు వసూలు చేశాడు. తర్వాత చాలా రోజులు గడిచినా వీసాలు రాకపోవడంతో అతడి వద్దకు యువకులు వెళ్లి నిలదీశారు. తొందరలోనే వీసాలు వస్తాయని, లేకుంటే డబ్బు వాపసు ఇస్తానని ఆ సమయంలో నమ్మించిన ఏజెంట్ అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాధితులు అతడి ఇంటి వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ఇప్పటికీ సదరు ఏజెంట్ అచూకీ దొరకలేదు.'

'ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లోని ఓ కన్సల్టెన్సీ ద్వారా బ్రిటన్‌లో చదువుతో పాటు ఉద్యోగం కింద పంపడానికి మెట్‌పల్లికి చెందిన ఓ యువకుడి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు తీసుకున్నాడు. కానీ వీసా రాకపోవడంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని యువకుడు అడుగగా అతడు చెల్లించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది'.

'మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన యువకుడు న్యూజిలాండ్ వెళ్లడానికి ఢిల్లీలోని ఓ కన్సల్టెన్సీని సంప్రదించాడు. దాని నిర్వాహకుల సూచనతో ముందుగా రూ.3.50లక్షలు చెల్లించాడు. తర్వాత స్వగ్రామానికి వచ్చిన యువకుడు కొన్ని రోజులకు వారికి ఫోన్ చేయగా ఆ నంబర్ పని చేయలేదు. చివరకు ఢిల్లీకి వెళ్లి చూడగా అప్పటికే వారు బోర్డు తిప్పేశారు. గత్యంతరం లేక మరో రూ.లక్ష ఖర్చు చేసి కువైట్ వెళ్లాడు'.

మెట్‌పల్లి(కోరుట్ల): విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలు పెరిగిపోతున్నాయి. భారీ వేతనాలను ఆశ చూపుతూ రూ.లక్షలు వసూలు చేస్తున్న కొందరు దళారులు ఆ తర్వాత ముఖం చాటేస్తున్నారు. జిల్లాలో దాదాపు ప్రతీ గ్రామం నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. అయితే కరోనా వల్ల అక్కడ ఉపాధి కోల్పోయి వేలాది మంది స్వగ్రామాలకు వచ్చారు. కొంతకాలంగా పరిస్థితులు మెరుగుపడడంతో గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉపాధికి ఆసక్తి చూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని పలువురు మోసాలకు పాల్పడుతున్నారు.

రూ.లక్షల వేతనాలని ఆశ చూపుతూ..

- గల్ఫ్ దేశాల్లో లేబర్ పనులకు రూ.20వేల నుంచి మొదలుకొని అత్యధికంగా రూ.50వేలకు మించి వేతనాలు లభించవు. ఇందుకు ఏజెంట్లు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.
- మలేసియా, సింగాపూర్, మాల్టా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, లిబియా, కెనడా తదితర దేశాల్లో రూ.లక్షన్నర నుంచి మొదలుకొని రూ.రెండు లక్షల వరకు వేతనాలు అందుతాయనే ప్రచారం ఉంది. వీసా కోసం బ్రోకర్లు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు వసూలు చేస్తున్నారు.
- ఆయా దేశాలకు వెళ్లడం ఖర్చుతో కూడుకున్నది అయినా రూ.లక్షల్లో వేతనాలు వస్తాయనే ఆశతో యువకులు అప్పు చేసి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు.
- ఈ దేశాలకు హైదరాబాద్, చైన్నై, ఢిల్లీల్లో ఉన్న కన్సల్టెన్సీల ద్వారా స్థానిక బ్రోకర్లు పంపుతున్నారు. జిల్లాలో ఇప్పటికే వందలాది మంది ఆయా దేశాలకు వెళ్లినట్లు తెలిసింది.

ఎన్నో విధాలుగా మోసాలు

- రూ.లక్షల వేతనాల కోసం ఆయా దేశాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్న వారిలో పలువురు కన్సల్టెన్సీలు, బ్రోకర్ల చేతిలో మోసాలకు గురవుతున్నారు.
- కన్సల్టెన్సీలు ముందుగానే వీసా ప్రక్రియ కోసం రూ.లక్షలు వసూలు చేసి ఆ తర్వాత పంపకుండా చేతులెత్తేస్తున్నాయి.
- మరోవైపు ఇతర దేశాలకు వెళ్లడానికి అవసరమైన విద్యార్హతలు లేని వారి కోసం బ్రోకర్లు నకిలీ సర్టిఫికెట్లను కూడా తయారు చేస్తున్నారు.
- ఇటీవల బ్రిటన్ వెళ్లడానికి ప్రయత్నించిన మెట్‌పల్లి యువకుడికి సంబంధిత బ్రోకర్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ తయారు చేశాడు. ఈ విషయాన్ని సదరు యువకుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బ్రోకర్‌తో పాటు అతడికి సహకరించిన మరో వ్యక్తిపై కేసు నమోదైంది.

దృష్టి సారించని అధికారులు

- విదేశాల్లో ఉద్యోగాల పేరిట జిల్లాలో కొంతకాలంగా ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయి. గతంలో కేవలం గల్ఫ్‌కు సంబంధించినవి మాత్రమే ఉండగా, ఇటీవల ఇతర దేశాలకు చెందినవి కూడా బయటపడుతున్నాయి.
- మోసపోయిన వారిలో కొందరు మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు బ్రోకర్లతో సెటిల్‌మెంట్ చేసుకొని వదిలేస్తున్నారు.
- పోలీసులు ఈ దందాపై దృష్టి సారిస్తే మోసాలకు అడ్డుకట్టు వేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

యువత అప్రమత్తంగా ఉండాలి



విదేశాల్లో ఉద్యోగాల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలి. కన్సల్టెన్సీలతో పాటు వాటి నిర్వాహకుల గురించి పూర్తిగా తెలుసుకొని నమ్మకం కుదిరిన తర్వాతే ముందుకు పోవాలి. కొందరు నకిలీ సర్టిఫికెట్లు కూడా తయారు చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. విదేశాలకు పంపేవారు మోసాలకు పాల్పడుతున్నారని అనుమానం వస్తే జాప్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– లక్ష్మీనారాయణ, సీఐ, మెట్‌పల్లి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రదర్శన

- కలెక్టర్ యాస్మిన్ బాషా



యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కలెక్టరేట్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని కలెక్టరేట్, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలతో పాటు ధర్మపురి ఏఈఆర్వో కార్యాలయాల్లో ఈవీఎంల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మూడు ప్రత్యేక వాహనాల ద్వారా సైతం అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

మొబైల్ వ్యాన్ ప్రారంభం

ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై మొబైల్ వాహనం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ యాస్మిన్‌బాషా తెలిపారు. గురువారం మొబైల్ వాహనాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, దివాకరన్ పాల్గొన్నారు.

ఆర్డీవో నర్సింహమూర్తి బాధ్యతల స్వీకరణ

జగిత్యాల: జగిత్యాల ఆర్డీవోగా నర్సింహమూర్తి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన మాధురి సంగారెడ్డికి అదనపు కలెక్టర్‌గా వెళ్లగా నారాయణఖేడ్‌లో పనిచేస్తున్న నర్సింహామూర్తి జగిత్యాలకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ యాస్మిన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా ఆర్డీవోను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సాహెబ్‌బాబు, రవిచంద్ర, రాజేశ్, మధుకర్ పాల్గొన్నారు.

జగిత్యాల సీసీఎస్ సీఐగా వెంకటేశ్వర్లు

జగిత్యాలక్రైం: మల్టీజోన్–1 పరిధిలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీజోన్–1 లో 24మంది సీఐలను బదిలీ చేశారు. కరీంనగర్ సీఎస్‌బీ సీఐగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లను జగిత్యాల సీసీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించండి

- ఎస్పీ భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గత ఆరు నెలల్లో పోలీస్‌స్టేషన్ పనితీరు, కేసుల ఛేదనలో సాధించిన పురోగతిని అంచనా వేసుకుంటూ రానున్న ఆరునెలల్లో మరింత దృఢనిశ్చయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరిస్తూ వాటి సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో నమోదైన వివిధ రకాల కేసుల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్సైకి సూచనలు ఇవ్వాలని సూచించారు. మహిళల భద్రతే లక్ష్యంగా పని చేయాలనిఆదేశించారు. జిల్లాలో గంజాయి సరఫరా చేసే మూలాలు, కీలక వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఠాణా పరిధిలో ఉన్న రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, రాజశేఖరరాజు, సీఐలు నటేశ్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, కోటేశ్వర్, రమణమూర్తి, ఎస్సైలు, ఐటీ కోర్, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి 59,165 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరదనీరు వస్తోంది. కొద్దిరోజులుగా ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో గురువారం సాయంత్రం 5 గంటల వరకు 59,165 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1,091.00 అడుగులకు ప్రస్తుతం 1073.08 అడుగులకు చేరింది. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలకు ప్రస్తుతం 36.954 టీఎంసీలు ఉంది. ప్రాజెక్ట్ నుంచి 1,046 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుంది.

కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఆలిండియా కాంగ్రెస్ పార్టీ గురువారం ప్రకటించింది. పీసీసీ అధ్యక్షుడు చైర్మన్‌గా ఉండే కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీలో 25 మంది సభ్యులతో కూడిన జాబి తాను గురువారం ఆలిండియా కాంగ్రెస్ పార్టీ ప్రకటించగా జగిత్యాల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా నియమితులైన కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, ముంజాల రఘువీర్‌గౌడ్‌తో పాటు ఇటీవల కాంగ్రెస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బొల్లి శేఖర్‌ను ఎమ్మెల్సీ గురువారం ఇందిరాభవన్‌లో శాలువాలతో సన్మానించారు. కా ర్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పోలీసు శాఖ తీరుపై ఫిర్యాదు చేస్తాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



స్వచ్ఛంద సంస్థ, పోలీస్‌శాఖ నిర్వహించే కార్యక్రమ బ్రోచర్ ప్రదర్శిస్తున్న జీవన్‌రెడ్డి, నాయకులు

జగిత్యాలటౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసేలా రాజకీయ అనుబంధ సేవాసంస్థలతో కలిసి పోలీసులు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయడం ఆక్షేపణీయమని, ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు పోలీసుశాఖ స్వచ్ఛందంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా స్వాగతిస్తామని పేర్కొన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని హితవుపలికారు. ఎన్నికల కోడ్ అమలులోకి రానున్న తరుణంలో మంత్రి సతీమణి కొప్పుల స్నేహలత ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎల్ఎం కొప్పుల స్వచ్ఛంద సంస్థ, జిల్లా పోలీసుల సంయుక్త భాగస్వామ్యంలో కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేయడం సరికాదన్నారు. కిందిస్థాయి ఉద్యోగులు తప్పు చేస్తే సరిచేయాల్సిన జిల్లా పోలీసు అధికారే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమేంటని ప్రశ్నించారు. అన్ని ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, రాబోయే రోజుల్లో ఎలాంటి తప్పు జరి గినా సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, గాజంగి నందయ్య, ధర రమేష్, మన్సూర్, నేహాల్, రఘువీర్‌గౌడ్, చందా రాధాకిషన్, బొల్లి శేఖర్, బీరం రాజేష్ తదితరులు ఉన్నారు.

జగిత్యాలలో భారీ వర్షం

- పొంగిపొర్లిన డ్రెయినేజీలు
- రహదారులు జలమయం
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు



జలమయమైన లింగంపేట రహదారి



హౌసింగ్‌బోర్డు కాలనీలో వరద



టాకా సందిలో..

జగిత్యాల: జగిత్యాల జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి మొదలైన వర్షం రాత్రి 8 గంటల కురవగా, రోడ్లన్నీ జలమయమై విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో కాలువలు, వాగులు పొంగిపొర్లాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. రోడ్లు జలమయం కాగా, జనజీవనం స్తంభించిపోయింది. కరెంట్ లేకపోవడం, భారీ వర్షం కురియడంతో జనం ఇబ్బందిపడ్డారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించినా కొన్ని కొనసాగించడంతో సాయంత్రం పూట ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. వర్షకాలంలో మొదటిసారిగా ఇంత భారీ వాన కురిసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీల్లో జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు ఇవ్వడంతో పాటు హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు. కూలిపోయే దశలో ఉండే ఇళ్లలో ప్రజలు ఉండకూడదని హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. రాత్రి 8.30 గంటల సమయంలో కొద్దిపాటిగా వర్షం తగ్గడంతో ఊపిరిపీల్చుకున్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక


మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

ధర్మపురి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నామని పలువురు కార్యకర్తలు తెలిపారు. మండలంలోని ఆరెపెల్లి గ్రామానికి చెందిన సుమారు 60 మంది గురువారం కరీంనగర్‌లోని మంత్రి కొప్పుల ఈశ్వర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు భరోసా

గొల్లపల్లి(ధర్మపురి): దేశ్ కీ నేత కేసీఆర్, బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు మరింత భరోసా అని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని గుంజపడుగు గ్రామంలో వివిధ పార్టీల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ రమణ, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లం రమేష్, జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ నక్క శంకర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, పీఏసీఎస్ చైర్మన్ మాధవరావు, వైస్ చైర్మన్ తిరుపతి, ఎంపీటీసీ తూర్పాటి రాజ్యలక్ష్మి, రవి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని సేవలో అదనపు కలెక్టర్


స్వామివారి ప్రసాదం అందిస్తున్న సిబ్బంది

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని గురువారం అదనపు కలెక్టర్ దివాకరన్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సంప్రదాయ రీతిలో మేళతాళాలతో స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, ఫొటో అందించారు. తహసీల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ రమేష్, ఆలయ ఉపప్రధాన అర్చకుడు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

జగిత్యాలక్రైం: జగిత్యాల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటస్వామి గురువారం రాత్రి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు.

పోలీసుల అదుపులో మహిళా దొంగలు?

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు మహిళా దొంగలను పోలీసులు పట్టుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వీరు దొంగతనం చేసి దోచుకెళ్లిన బంగారాన్ని కోరుట్ల, జగిత్యాల, ఆర్మూర్, నిర్మల్ ప్రాంతాల్లో విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడయిందని తెలిసింది.

కొండగట్టులో నీటి సమస్యకు పరిష్కారం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- రూ.13.43 కోట్లతో ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే రవిశంకర్ తదితరులు

మల్యాల(చొప్పదండి): 'చెప్పింది చేస్తాం.. అనుకున్నది సాధిస్తాం.. తెలంగాణ తెస్తామని తెచ్చి చూపించినం.. కోటి ఎకరాలకు సాగు నీరందిస్తున్నాం' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నప్పుడు నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని, దీంతో కొండగట్టులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వరదకాలువ 81.10కిలో మీటరు వద్ద రెండు మోటార్లతో నిత్యం 10వేల క్యూసెక్కులను సంతలోని లొద్దిలోకి ఎత్తిపోసేందుకు రూ.13.43కోట్ల నిధులు కేటాయించగా, గురువారం వినోద్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ భాషా, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల్లో ఎత్తిపోతల పనులు పూర్తిచేసి కొండగట్టుపైకి వరదకాలువ నీటిని తరలించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కొండగట్టును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే రవిశంకర్ చొరవను మంత్రి అభినందించారు. అంజన్న సన్నిధికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రామ్మోహన్ రావు, పునుగోటి ప్రశాంతి, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, పునుగోటి కృష్ణారావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్షణాల్లో మాయమైతివా బిడ్డా..

- కళ్లు తిరిగి కిందపడి డిగ్రీ విద్యార్థి మృతి
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు
- గుంజపడుగులో విషాదం


అరుణ్ (ఫైల్)


అరుణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గొల్లపల్లి(ధర్మపురి): 'క్షణాల్లో మాయమైతివా బిడ్డా'అంటూ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అప్పటి వరకు బాగానే ఉన్న యువకుడు కళ్లముందే కుప్పకూలడం, ఆపై ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికుల వివరాలు.. గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఓరుగంటి సరోజన–మల్లేశం దంపతులకు అరుణ్(18), కూతురు అక్షిత సంతానం. అరుణ్ జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, కూతురు గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకునే దంపతులు పిల్లలను ఉన్నంతలో చదివిస్తున్నారు. అరుణ్ గురువారం మధ్యాహ్నం మినరల్ వాటర్ తీసుకొచ్చేందుకు వెళ్లాడు. నీటిని క్యాన్‌లో పడుతున్న క్రమంలో అక్కడే ఒక్కసారిగా కళ్లు తిరిగి కింద పడిపోయాడు. మరోసారి బలవంతంగా లేచి నిలుచునే క్రమంలో మళ్లీ కుప్పకూలాడు. క్షణాల్లో కుప్పకూలడం, ఆపై ప్రాణాలు పోవడంతో స్థానికులు షాక్‌కు గురయ్యారు. అయినా ఆందోళనలో ఉన్న స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, కిందపడిపోవడంతో శ్వాస ఆగి చనిపోయాడని ధ్రువీకరించారు. చేతికి అందివచ్చిన కొడుకు చనిపోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించగా, వారిని ఆపడం ఎవరితరం కాలేదు.

కాంగ్రెస్ పాలనలో ఆకలి కేకలు


నిరసన తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్, తదితరులు

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పాలనలో ఆకలి కేకలు, ఉపాధి వలసలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మూడు గంటల విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పొరండ్ల రైతువేదిక వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక రకాలుగా చర్యలు తీసుకుని అద్భుత విజయాలు సాధిస్తుంటే కాంగ్రెస్ నాయకత్వం వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ చాలని అనడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరంతో పాటు 20కి పైగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి 46 వేల చెరువులను బాగుచేసి ఈ తొమ్మిదేళ్లలో కోటి ఎకరాల మాగాణిగా మార్చిన మహనీయుడు కేసీఆర్ అన్నారు. కటిక చీకట్ల కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, నాయకులు ఆరె తిరుపతి, రవి, గంగాధర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు బేడీలు వేయించినోళ్లను మరిచిపోదామా?'


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): పంటలకు గిట్టుబాటు ధర అడిగితే రైతులకు బేడీలు వేయించినోళ్లను మరిచిపోదామా అంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీరుపై కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం కథలాపూర్‌లో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 5 కిలోలు కోత పెట్టి దోచుకుంటే బీఆర్‌ఎస్ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్లు రైతులను ఇబ్బంది పెట్టి ఖద్దర్ బట్టలు తొడుక్కొని ఉచిత కరెంట్‌పై రాజకీయం చేసే బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. హామీలిచ్చి మోసం చేసిన బీఆర్‌ఎస్ నాయకులను రైతులు నిలదీయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు కాయితి నాగరాజు, ఎండీ అజీమ్, వెలిచాల సత్యనారాయణ, పులి హరిప్రసాద్, రిక్కల తిరుపతిరెడ్డి, ఎండీ రేహన్, విక్రమ్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు



ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న రామనాథం

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి, భీమారం మండలాల్లోని 14 ఆలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా రూ.1.40 కోట్లు మంజూరైనట్లు జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు గురువారం తెలిపారు. మేడిపెల్లి మండలం పోరుమల్లలో 3 ఆలయాలు, గూండ్లపల్లి 1, మేడిపెల్లి 2, కొండాపూర్ 1, వల్లంపెల్లి 1, కాచారం 1, భీమారం మండల కేంద్రంలో 1, రాగోజీపేట 1, మన్నెగూడెం 2, మోత్కురావుపేటలో 1 ఆలయానికి నిధులు మంజూరయ్యాయి. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు.

కోదండ రామాలయం పరిశీలన

మేడిపెల్లి మండలం కాచారం గ్రామంలోని కోదండ రామాలయాన్ని టీటీడీ అధికారి రామనాథం గురువారం పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. నిధులతో ఏయే పనులు చేయించాలనే విషయంపై సూచనలిచ్చారు. నిధుల మంజూరుకు కృషి చేసిన కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, సర్పంచ్ సురేశ్, ఎంపీటీసీ లక్ష్మి, ఏఎంసీ వైస్‌చైర్మన్ లింగారెడ్డి పాల్గొన్నారు.

దళిత మహిళలు స్వయం ఉపాధి పొందాలి


అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనారాయణ

పెగడపల్లి(ధర్మపురి): దళిత మహిళలు స్వయం ఉపాధివైపు దృష్టి సారించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామంలో గురువారం 18 నుంచి 49 ఏళ్లలోపు దళిత మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి నిపుణులైన ట్రైనర్లను నియమించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రాల ద్వారా నైపుణ్యాన్ని సాధించి ఆయా రంగాల్లో నిలదొక్కుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి కుట్టు మిషన్లు కూడా అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న దళిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బతికపల్లిలో కొనసాగుతున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి వారు తయారు చేసిన దుస్తులను పరిశీలించారు. సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, శోభారాణి, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, ఏపీవో సమత, ఉప సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం

జగిత్యాల: అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శం తెలంగాణ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం 1వ వార్డుకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పలు పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం జరిగిందని, ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు దేశాయి, సమిండ్ల శ్రీను, అడువాల జ్యోతి, బాలె శంకర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లు బంద్ చేయలే

ధర్మపురి: భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెండురోజుల పాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. కానీ ధర్మపురితో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలలు గురువారం బందు చేయక యథావిధిగా కొనసాగించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక వైపు వర్షం కురుస్తున్నా తమ ఉనికిని చాటుకునేందుకు పాఠశాలలు కొనసాగించడం ఏంటని పలువురు పేరెంట్స్ ప్రశ్నించారు. ఈ విషయమై మండల విద్యాధికారి భీమయ్యను వివరణ కోరగా, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేసిన ప్రైవేట్ పాఠశాలలపై డీఈవోకు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు.

జేఎన్టీయూకు బస్సు నడపాలి

జగిత్యాలటౌన్: కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ కళాశాలకు ప్రత్యేక బస్సులు నడపాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులను కోరారు. జేఎన్టీయూకి బస్సు నడిపేలా చూడాలని కోరుతూ సదరు కాలేజీ విద్యార్థి పేరెంట్ గురువారం ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రస్తు తం కరీంనగర్, జగిత్యాల తదితర ప్రాంతాల నుంచి వెళ్తున్న విద్యార్థులు జేఎన్టీయూ చెక్‌పోస్టు (దొంగలమర్రి) వద్ద బస్సు దిగి ప్రైవేట్ వాహనాల్లో కళాశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాలేజీ వరకు స్పెషల్ బస్సు నడపాలని కోరారు.

ఆర్టీసీ బస్సు కిందపడి మహిళకు గాయాలు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఓ మహిళ గురువారం ఆర్టీసీ బస్సు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సు జగిత్యాల వెళ్తూ మార్గమధ్యంలో ఆనంద్‌షాపింగ్ మాల్ వద్ద ఆగింది. ప్రయాణికులను ఎక్కించుకొని కదులుతుండగా అక్కడే ఉన్న పుప్పాల లక్ష్మి(47) ఒక్కసారిగా బస్సు కింద పడింది. వెంటనే పలువురు కేకలు వేయడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశాడు. ఈ ప్రమాదంలో ఆమె తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. మొదట ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. స్థానిక దుబ్బవాడ ప్రాంతానికి చెందిన లక్ష్మి బస్సు ఎక్కే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జారి పడిందా? లేక ఆత్మహత్యకు యత్నించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

బుగ్గారం(ధర్మపురి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయడం ద్వారా తిరిగి గుర్తించి సదరు బాధితుడికి అప్పగించారు బుగ్గారం పోలీసులు. ఎస్సై కథనం ప్రకారం.. బుగ్గారం గ్రామానికి చెందిన చుక్కల సందీప్ బుధవారం వెనుగుమట్ల సమీపంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మొబైల్ వివరాలను సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఫోన్ ఉనికిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధితుడికి సమాచారం అందించి ఫోన్ అప్పగించారు.

నూకలమర్రి అమరులకు అరుణోదయ నివాళి


నూకలమర్రి అమరులకు నివాళి అర్పిస్తున్న అమర్, విమలక్క తదితరులు

సిరిసిల్ల: వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో 23 ఏళ్ల కిందట అమరులైన వారికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గురువారం నివాళి అర్పించింది. హైదరాబాద్‌లోని అరుణోదయ ఆఫీస్‌లో నూకలమర్రి అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనశక్తి మాజీ రాష్ట్ర కార్యదర్శి కూర దేవేందర్ అలియాస్ అమర్, ఆయన భార్య, అరుణోదయ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క అమరులకు జోహార్లు అర్పించారు. 23 ఏళ్ల కిందట అమర్ రాసిన «నల్ల నల్ల రేగళ్ల నల్ల రేగళ్ల ఎర్ర కలువ పూలు పూసే» పాటను విమలక్క బృందం ఆలపించింది. నూకలమర్రి ఎన్‌కౌంటర్‌లో అమరులైన అశోక్, జ్యోతి, చైతన్య, మల్లేశం, గసికంటి పర్శరాములు, సముద్రాల ఎల్లేందర్, దొంతుల రమేశ్‌లకు నివాళి అర్పించారు. అరుణోదయ జంట నగరాల అధ్యక్ష, కార్యదర్శులు పోతుల రమేశ్, రాకేశ్, అరుణోదయ సిటీ కమిటీ సభ్యులు విశాల, హరికృష్ణ, పీడీఎస్‌యూ(విజృంభన) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏపూరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్


నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, రైతులు

మల్యాల(చొప్పదండి): తెలంగాణ రైతులు ఎదుగుతుంటే ఓర్వలేని రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను రేవంత్‌రెడ్డి మరోసారి బయటపెట్టారని వివరించారు. కర్షకులకు 24గంటలు ఉచిత విద్యుత్ వద్దన్న కాంగ్రెస్‌కు రైతులు బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ ఆలోచనలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'కేంద్ర మంత్రిని అరెస్టు చేయడం దారుణం'


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్(వేమువాడ): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కథలాపూర్ మండలం సిరికొండలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. నిరుద్యోగ భృతి, దళితబంధు, పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వివరించారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎడ్మల వినోద్‌రెడ్డి, శ్రీరాముల ప్రకాశ్, మల్యాల మారుతి, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, ఒడ్నాటి సునీల్, శ్రీకర్, తెడ్డు మహేశ్, రాజారెడ్డి, స్వామిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ నిర్మాణం ఆపాలి


ఆందోళన చేస్తున్న జాంబాగ్ కాలనీవాసులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జాంబాగ్ ప్రాంతంలో శ్మశానవాటిక సమీపంలో చేపల మార్కెట్ నిర్మిస్తున్నారు. మోతెకు చెందిన గంగపుత్ర సంఘం నాయకులు చేపలు అమ్ముకునేందుకు మార్కెట్ కోసం భవనానికి ఇటీవల నిధులు మంజూరు కాగా అక్కడ నిర్మాణం చేపడుతున్నారు. కాగా, 17వ వార్డు కాలనీవాసులు అక్కడ చేపల మార్కెట్ నిర్మిస్తే దుర్వాసనతో పాటు ఇబ్బందికరంగా ఉంటుందని, ఇప్పటికే ఇక్కడ పెద్ద నాలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కౌన్సిలర్ సింగారావు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చేపల మార్కెట్ నిర్మిస్తే ఇబ్బందికరంగా ఉంటుందని, ఇది మున్సిపల్ ప్రాంతంలోనే వస్తుందని పేర్కొన్నారు. కానీ మోతెకు చెందిన గంగపుత్రులు మాత్రం తమకు ఇక్కడ కేటాయించారని పేర్కొంటున్నారు. కాగా చేపల మార్కెట్ భవన నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని వేరే చోట నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టా భూమి అని మరికొందరు

సదరు చేపల మార్కెట్ నిర్మిస్తున్న చోట అది పట్టా భూమి అని భద్రి నర్సయ్య, నారాయణ, కిషన్, దయాకర్ పేర్కొంటున్నారు. ఆ సమీపంలోనే కొంత భూమి రోడ్డుకు పోగా, తాము కొంత భూమిని అమ్మడం జరిగిందని, కానీ అక్కడ మార్కెట్ నిర్మిస్తున్నారని, అధికారులు పూర్తిస్థాయిలో కొలతలు చేపట్టాలని కోరుతున్నారు.

సభ విజయవంతం చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సారంగాపూర్(జగిత్యాల): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 27న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల విశ్వరూపం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మహాసభ కరపత్రం ఆవిష్కరించిన మాట్లాడారు. వర్గీకరణ అంశం అంతిమ పోరాటానికి అన్ని గ్రామాల నుంచి సభకు తరలించేలా ఆయా గ్రామాల ప్రతినిధులు కృషిచేయాలని కోరారు. వర్గీకరణ అంతిమ పోరాటంలో పార్టీలకు అతీతంగా ప్రతీ మాదిగబిడ్డ, ఉపకులాలు బేడ బుడగ జంగాలు, చింది మాదిగ, డెక్కలి, రెల్లి మస్టిన్ తదితర ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గందమాల నాగభూషణ్, ఎంఎస్పీ బెజ్జంకి సతీష్‌మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ దూమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్, మండల ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, నాయకులు బలవంతుల సురేష్, చాతరాసి లక్ష్మీరాజం, చాతరాసి సురేష్, కుంటా శ్రీను తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నంలో బ్యాటరీల దొంగల అరెస్ట్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో వాహనాల నుంచి బ్యాటరీలను అపహరిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అయిలాపూర్‌కు చెందిన అల్లెపు రాజేశం, మోర్తాడ్‌కు చెందిన ఎడ్ల అశోక్, యామాపూర్‌కు చెందిన సూర శ్రీకాంత్ సులభంగా డబ్బు సంపాదించడానికి దొంగతనాలపై దృష్టి సారించారు. కొంతకాలంగా ఆటోలు, ట్రాక్టర్‌లు, సెల్ టవర్లు, క్రేన్లకు సంబంధించిన బ్యాటరీలను చోరీ చేస్తున్నారు. ఇటీవల బండలింగాపూర్‌లో ఐదు ఆటోల నుంచి బ్యాటరీలను చోరీ చేయగా, వాటి యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఇబ్రహీంపట్నంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పద స్థితిలో కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల విషయం బయటపడింది. వారి నుంచి రూ.1.50లక్షల విలువైన బ్యాటరీలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ ఉమాసాగర్, సిబ్బందిని సీఐ అభినందించారు.

కోతుల దాడిలో మహిళలకు తీవ్రగాయాలు

సారంగాపూర్(జగిత్యాల): మండల కేంద్రంలో గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కోతులు దాడి చేయడంతో పురుమల్ల అనసూర్య, కర్నె వనజ తీవ్రంగా గాయపడ్డారు. సారంగాపూర్‌కు చెందిన అనసూర్య ఇంట్లో పనులు ముగించుకుని బయట నిలబడగా అదే సమయంలో కోతులు ఇంటి కాంపౌండ్‌లోకి వచ్చాయి. వాటిని బయటకు పంపేందుకు ప్రయత్నిస్తుండగా ఆమెపై పడి దాడిచేయడంతో తీవ్రగాయాలైనాయి. అనసూర్య ఇంటి సమీపంలోనే ఉంటున్న కర్నె వనజ ఇంటిపైన బట్టలు ఆరవేసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న కోతులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇద్దరికి తీవ్ర రక్తస్రావం కావడంతో వేర్వేరుగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సీసీరోడ్డు నిర్మించాలని నిరసన



మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామంలో గురువారం బీజేపీ సీనియర్ నాయకుడు పెనుకుల అశోక్ ఆధ్వర్యంలో యువకులు బురద రోడ్డుపై వరినాట్లు వేస్తూ నిరసన తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.